ఆరోజు...

బొమ్మరిల్లులా అందంగా ఉన్న ఆ చిన్ని ఇంటి ముందు రిక్షా ఆగింది. ఇంటినీ ఇంటిముందున్న పూలమొక్కల్ని తదేకంగా పరికిస్తున్న నాతో—

'దిగరా, ఇదే మా ఇల్లు' అన్నాడు భార్గవ.

నా రాక మీ ఇంటికి పెద్ద అఘాతమౌతుందని వాడికా క్షణం తెలియదు. రిక్షా దిగి వాణ్ణి అనుసరించాను.

నన్ను హాల్లో కూర్చోబెట్టి 'భావనా... భావనా' అంటూ కేకేస్తూ లోపలికి నడిచాడు వాడు.


ఎన్నో రాత్రులు నక్షత్రాలు లెక్కపెట్టుకుంటూ నిన్ను మర్చిపోవాలని యత్నిస్తే ఆ నక్షత్రాల్లో నక్షత్రమై నన్ను బాధించేదానవు.

కళ్ళు మూసినా, తెరచినా కళ్ళ ముందు నీ రూపమే సాక్షాత్కరిస్తుంటే సృష్టి సమస్తం నువ్వే అయి కవ్విస్తుంటే నిగ్రహించుకోవడం నాకు సాధ్యమా?

నిన్ను చూడందే నాకు దినం గడిచినట్టుండేది కాదు.

ప్రొద్దుటనగా వెళ్ళిన భార్గవ రాత్రి అయినా గానీ రాడు అని తెలిసినా భార్గవ నెపంతో మీ ఇంటికి వచ్చే వాణ్ణి సంస్కారం కాదని తెలిసినా.

నువ్వు గుమ్మానికానుకుని తలొంచుకుని నిల్చుంటూ, చీరకొంగు చేతివేళ్లకు చుట్టుకుంటూ ఉంటే నిన్నే చూస్తూ గడిపేవాడిని.



# ఇదో జాలికథ

—కాంద్రేగుల శ్రీనివాసరావు

నేను గోడ మీదున్న పెయింటింగ్స్‌ని పరిశీలిస్తూ కూర్చున్నాను.

మొదట నీ పాదసవ్వడి వినిపించింది.

'నా భార్య భావన' అంటూ వాడు నిన్ను పరిచయం చేసినప్పుడు 'నమస్కారం' అంటూ సుకుమారమైన నీ చేతుల్ని జోడించినప్పుడు—

నేను ప్రతిగా నమస్కారం చేయటం కూడా మర్చిపోయి నిన్నే చూస్తూ అగమ్యమైన తియ్యదనంలో లీనమైపోయాను.

నా చూపులకి నువ్వు కాస్త ఇబ్బందిగా కదిలినప్పుడు—

'ఏమిట్రా ఫూల్ అలా ఉండిపోయావు?' అని వాడు చమత్కరించేదాకా నేను వాస్తవంలోనికి రాలేకపోయాను.

నువ్వు తిరిగి వెళ్ళిపోయేటప్పుడు రెపరెపలాడే నీ చీర అంచు నన్ను కదిలించి, నన్ను నేనే మర్చిపోయినట్లు చేసింది.

భగవంతుడు ఎంత నిర్దయుడు?

సృష్టిలోని అందాన్నంతా నీలోనే ఇమిడ్చి భార్గవకి బహుమతిగా ఇచ్చాడు. అవును. భార్గవ అదృష్టవంతుడు.

ఆ అదృష్టం నన్నెందుకు వరించలేదో?

నేను మిక్కిలి దురదృష్టవంతుణ్ణి. ఈ ప్రపంచంలో నాదీ అంటూ చెప్పుకోవటానికి ఏదీ లేదు. చిన్నప్పుడే తల్లిదండ్రుల్ని పోగొట్టుకున్నాను. మేనమామ హయాంలో కొన్నేళ్లు బతుకీడ్చాను. ఆ తరువాత అతడు కూడా ఏదో పనున్నట్టు హడావుడిగా వెళ్ళిపోయాడు.

ఈ భూమ్మీద నాకంటూ ఏదీ మిగుల్చుకోలేని ఏకాకిని.

ఆ తరుణంలోనే ఎడారిలో పన్నీటి జల్లులా భార్గవతో స్నేహం తటస్థించింది. నా అంతరంగాన్ని అర్థం చేసుకుని, కాస్త ప్రేమ, ఆప్యాయతల్ని పంచి ఇచ్చిన వాడు భార్గవ ఒక్కడే. వాడు నాకు స్నేహితుడు మాత్రమే కాదు. నా సమస్తమూ వాడే!

నిన్ను చూశాక అలాంటి ప్రాణ మిత్రుడు, కాస్త శత్రువు అయినట్టనిపించింది.

నిన్ను చూసిన హృదయం తపించింది.

నువ్వే నా జీవిత పరమార్థమనిపించింది.

నేను దారి తప్పుతున్నానని తెలుసు. భార్గవకి చెయ్యరాని ద్రోహం చేస్తున్నానని కూడా తెలిసి నాలో నేనే ఎంతో మదనపడేవాడిని.

ఆ క్షణాల మాధుర్యం, ఆ చూడటంలోని ఆనందం నీకెలా చెప్పేది?

కాలం స్తంభించిపోతే బాగుణ్ణనిపించేది.

లేచి వచ్చేస్తున్నప్పుడు హృదయం అశాంతితో నిండిపోయేది.

మళ్ళీ నా దేవతని చూసే భాగ్యం ఎప్పుడాసన్నమౌతుందోనని ఆ క్షణం నుంచే తపించేది నా హృదయం.

భార్గవ లేనప్పుడు తరచూ వస్తూండటం వలన, నీతో మాట్లాడే అదృష్టం కాలక్రమేణా పదేపదే జ్ఞప్తికొచ్చేవి.

నా హృదయం అంతులేని కోర్కెతో తపించేది.

నాకు కావలసింది నాకు దొరకటం లేదు.

మనసు నా వశం తప్పుతోంది.

వాంఛతో అనుక్షణం రగిలిపోతోంది.

శరీరం నిద్రాహారాలకి దూరమౌతుంది.

ప్రేమ మానసికమైన భావన అయితే, శరీరాన్ని హింసించే హక్కు దానికెవరిచ్చారు?

—ఇలా అనుక్షణం నా ఊహల్లో ఊహవై నన్ను బాధించటం నీకు న్యాయమేనా? అని నిన్ను అడగాలనిపించేది.

ఎందుకో, ఎంత వద్దనుకున్నా ఆ సంఘటన గుర్తొస్తూనే ఉంటుంది. శీతాకాలపు నీరెండలో ఆ రోజు అరుగుమీద కూర్చొని పారాణి పూసుకుంటున్నావు. ఆ పాదాలపై పారాణే నేనైతే ఎంత పరవశించిపోయేవాణ్ణో.

అందమైన ఆ పాదాలపై గోరింట పెట్టిన గోళ్ళు చురుకుగా కదలాడుతూ నన్ను మంత్ర ముగ్ధుల్ని చేశాయి.

నా రాక పసిగట్టి పలుకరింపుగా నవ్వుతూ నన్ను ఆహ్వానించావు. నా ఎదుట కూర్చొని అవీఇవీ మాట్లాడుతూ కాలాన్ని కరిగిస్తున్నావు. ఆ క్షణంలో నాకేమైందో తెలియదు.

లేచి నిల్చున్నాను. నేను వెళ్ళిపోతానమకుని నన్ను సాగనంపటానికి కాబోలు నువ్వు లేచావు.

అప్పుడు...

అదే అదను అనుకుని, అదిరే గుండెతో నిన్ను పైశాచికంగా వాటేసుకున్నాను.

నువ్వు వ్యతిరేకించావు.

ఒక్కసారిగా నన్ను విదిలించికొట్టావు.

తప్పుచేసిన వాడిలా నీ ముందు తలవంచుకుని నిలబడ్డాను.

నీ వాడి చూపులకి తట్టుకునే శక్తిని నాకిమ్మనమని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ నీ కళ్ళల్లోకి చూడ్లేక, నేల చూపులతో కాసేపు గడిపి తరువాత ఎలాగో సాహసించి దృష్టి నీ వైపు మరల్చాను.

కానీ ఆశ్చర్యం?

నీ చూపుల్లో గ్రీష్మం లేదు.

నీ మోహంలో క్రోధం లేదు.

నా తప్పుని నువ్వు క్షమించావని నాకు తెలుసు. కానీ నా పాపాన్ని నువ్వు చూశావనే సిగ్గుతో నా మొహాన్ని నీకు మళ్ళీ ఎలా చూపించగలను?

నీకు దూరమౌదామని నా ఊహల్లోంచి నిన్ను



## ఇంటిదగ్గరైతేనేం

లాయర్ యస్.ఐతో "నేరస్తుడ్ని లాకప్‌లో ఉంచకుండా ఇంటికెందుకు తీసుకెళ్ళారు"

" ఈ మధ్య లాకప్ మరణాల గోలెక్కువయ్యిందని ఇంటిదగ్గరావుంచేశాను" జవాబిచ్చాడు ఎస్.ఐ

శుభ, మేడపల్లి

దూరం చేద్దామని, సుదూర తీరాలకి పయనమయ్యాను. ఎన్నో యాత్రాస్థలాలు సందర్శిస్తూ, పవిత్ర జలాల్లో జలకాలాడి, చేసిన పాపాన్ని కడిగేసుకోవాలని వెర్రి తపనతో నాలుగు దిక్కులు తిరిగాను. నా హృదయ మందిరాన్ని ఎంత శుభ్రం చేద్దామన్నా నీ తలపులు మూల మూలలు చేరి నన్ను కంపింపజేస్తూనే ఉన్నాయి.

సృష్టి యావత్ నువ్వే అయి నన్ను రెచ్చగొడుతూ, నా జ్ఞాపకాల్లో అనుక్షణం సజీవమై సంచరిస్తుంటే నాకు సుఖమెక్కడ?

నా స్వాప్నిక ప్రపంచంలో నువ్వు శాశ్వతమని చాలా ఆలస్యంగా గ్రహించాను. ఇక నీకు ఎంత దూరంగా ఉన్నా వ్యర్థమే అనిపించి తిరిగి వచ్చేశాను. మీ ఇంటికి నా రాకపోకలు మళ్ళీ పునః ప్రారంభమయ్యాయి.

ఒకసారి చేసిన పొరపాటు మళ్ళీ ఎన్నడూ చేయకూడదని మనసుని ఎంత నిగ్రహించుకున్నా రెండోసారి కూడా చేయక తప్పిందికాదు.

నీ చేతిని నా చేతుల్లోకి తీసుకుని పెదాలకి అదిమి చుంబించినప్పుడు నీ కళ్ళల్లో చిరుకోపాన్ని, ముఖంలో కాఠిన్యాన్ని నేను గమనించలేకపోలేదు.

నా రెండో తప్పుని కూడా క్షమిస్తూ ఆరోజు నాకెన్నో కబుర్లు చెప్పావు. భార్గవని నువ్వెంతగా ప్రేమిస్తున్నదీ, నేనెంతగా ద్రోహం చేస్తున్నదీ విడమర్చి పసిపిల్లాడికి చెప్పినట్లు హితబోధ చేశావు.

ఈ బొందిలో ప్రాణం ఉండగా నిన్ను మర్చిపోవటం నాకు సాధ్యంకానట్టుంది. నా నైజం నాకే విస్మయం అనిపించేది. ప్రేమ కోసం మనిషి ఎందుకు ఇంతగా దిగజారిపోతాడు?

నా మౌన దేవతా! ఈ దరిద్ర హృదయాన్ని కరుణించవా? అంటూ నిన్ను వేడుకోవాలనిపించేది.

చలం అన్నట్టు "పాపమనేదే లేకపోతే ఈశ్వరుడు క్షమకి చోటెక్కడ ఉంది? నువ్వు పాపం చేసినా నిన్ను క్షమించడానికి ఈశ్వరుడు సిద్ధంగా ఉన్నాడు ఇక విచారమెందుకు?" అని నీతో చెప్పాలనిపించేది.

కొన్నికోట్ల చీకట్లు గుండె చుట్టూ అలుముకుని, హృదయంలో అగ్నిపర్వతాలు బద్దలౌతూంటే ఆ తాకిడిని, సముద్ర ఘోషల్ని, హృదయంలోనే పదిలపరచుకుని నిండుకుండలా తొణక్కుండా ఉండటం నాకు అలవి కావటంలేదు.

నా జీవిత వీణాతంత్రుల్ని మోగిస్తూ నా జీవితం మధురం చేయమని నిను వేడుకుందామని ఎన్నో మరింకెన్నో చెప్పాలనీ, నా మనసు నీకర్పిద్దామని వచ్చిన నాకు నిన్ను చూశాక మాటలే కరువయ్యాయి.

నా హృదయంలోని కోర్కెలన్నీ రక్తాశ్రువులుగా మార్చి నీ పాదాలు ముందు ప్రవహింపజేయాలనే కోర్కెతో నీ ముందు మోకరిల్లి నీ పాదాలుకి తలవాల్చి నా పెదాలతో స్పర్శించాలని ఆయత్తమయ్యాను.

కానీ నా పెదవులకి నేల తగిలి నన్ను నిరుత్సాహపరిచింది.

ఈసారి కూడా ఓటమి నావైపే నిల్చిందనే నిస్సహాయతతో తలపైకెత్తి నీవైపు చూశాను. కలో నాస్తవమో తెలియదు.

నా గుండె క్షణ కాలం లయతప్పింది.

నువ్వు నా భుజాలు పట్టుకుని లేవనెత్తి నీ గులాబీల పెదాలతో నా నుదిటును నుతారంగా చుంబించావు.

నా అంతరాంతరాల్లో తంత్రులు తీవ్రమైన ప్రకంపనాన్ని పొందాయి. నా హృదయం పరవశించిపోయింది.


నా దేవత నన్ను కరుణించింది.

నా హృదయ భారాన్ని తేలికపర్చటానికన్నట్టు నా తల నిమురుతూ నీ గుండెలకు అదుముకున్నావు. నీ ప్రేమలో నన్ను మంత్ర ముగ్ధుణ్ణి చేశావు.

ఈ దెబ్బతిన్న హృదయాన్ని కరుణించావు.

నీ వక్షంమీద తలవాల్చి చాలాసేపు స్తబ్దుగా ఉండిపోయాను. ప్రపంచంలో ఎక్కడా దొరకని నిశ్చలత నాకక్కడ లభించినట్లయింది.

నేను నిన్ను విడిచి వచ్చేస్తున్న సమయాన నా హృదయం అంతా తియ్యతియ్యటి తేనెలతో నిండిపోయింది. ప్రపంచాన్ని జయించినంత సంతృప్తిగా ఉంది. ఇంతటి ఆనందాన్ని నా హృదయం భరించలేదేమోనని భయం వేసింది.



భావనా! చాలు నాకీ సంతృప్తి చాలు. ఏమిటీ ఈ తత్వమంతోషి అని ఆలోచిస్తున్నావా? ప్రేమ పిపాసినై నీ జీవితానికి ప్రతిబంధమవకుండా సంతృప్తి చెందుతూ అల్ప సంతోషినవటమే మంచిది కదూ!

జీవితానికి పరిపూర్ణత లభించింది. నా జీవితకాలం పరిపడే సంతృప్తి నీ స్పర్శ వల్ల నాకు లభ్యమైంది.

నా హృదయంలో ప్రేమను, నీ ప్రేమాస్వాదనతో బయటకు తెచ్చావు. కృతజ్ఞతలు. నాకిక రేపుతో పనిలేదు. రేపు మీద ఆశకూడా లేదు. ఇవ్వాళే నా జీవితం ఆఖరు అయితే బాగుణ్ణు అనిపిస్తోంది. ఇవాళ ఎంత ఆనందంగా ఉందని, సృష్టి యావత్ నన్ను పరవశింపజేయటానికే ఆరాటపడుతున్నట్టు—అగుపిస్తోంది.

నా జీవితానికి సార్థకత లభించింది. ఏమిచ్చి నీ రుణం తీర్చుకోగలను.

నా ప్రాణానికి ప్రాణం అయిన భార్గవకి ద్రోహం చేశాను. ప్రాయశ్చితంగా ఏమి ఇవ్వను?

అందుకే ఇవన్నీ ఆలోచించే నీ సముఖంలో మంచి వెళ్ళిపోతున్నాను.

నా ఈ నిష్క్రమణ మృత్యువులా భావించకు. జీవితానికి పరిపూర్ణతని గ్రహించు. మనకు తెలియనంత తొందరగా కాలం గడిచిపోతోంది. జీవితం మనకు కొన్ని మాత్రమే మధుర క్షణాల్ని ఇస్తోంది. నాకున్న అతికొద్ది మధుర క్షణాలు నీ సమక్షంలో గడిపినవే.

ఆ రెండు క్షణాల్లో ప్రేమ అనే రెండక్షరాల్లో అనుభూతిని అనుభవించాను. స్త్రీ ప్రేమ ఇంత గొప్పదని, ఇంత శక్తివంతమైందని నాకిప్పుడిప్పుడే అవగతమౌతోంది.

చాలు భావనా! నాకీ సంతృప్తి చాలు! రేపు మీద ఆశతో నేను సజీవమై ఉంటే మళ్ళీ నీ పొందు కోరుతూ, నీ జీవితానికి ప్రతిబంధమౌతాను. అలాగని నీ దూరతీరాలకో సాగిపోతే నీ జ్ఞాపకాలు నన్ను ప్రశాంతంగా ఉండనివ్వవు. పరికదా తిరిగి నీ వద్దకే నన్ను చేరవేస్తాయేమోనని భయం.

అందుకే నీకు గురుదక్షిణగా నన్ను నేను సమర్పించుకోనీ, ప్రేమ కోసం ప్రాణాల్ని ఆహుతి చేయగలిగే నిస్వార్థత మనిషికెలా వస్తుందో నాకిప్పుడే తెలుస్తోంది.

అరె! నీ కళ్ళల్లో నీటిపొర. పిచ్చిదానా! ఎవరు ఈ ప్రపంచంలో శాశ్వతం.

పూచిన పుష్పం వాడి రాలిపోతుంది. దానికోసం ఎన్నెందుకు విచారపడటం. మట్టిలో కలిసిపోయే నా దేహం గురించి ప్రాకులాడకు.

ఈ మధుర నిశీధిని మర్చిపోయి భార్గవ జీవితాన్ని మధురం చెయ్యి. అప్పుడే నా ఆత్మకు శాంతి.

పడమటి కొండల్లోనికి నిష్క్రమించటానికి సూర్యుడు తొందరపడుతున్నాడంటే ఆ బంగారు ఛాయల్లోకి పోవడానికే కదా!

నా ఈ నిష్క్రమణ కూడా ఏ ప్రత్యేకతా లేని సూర్యాస్తమయంలా గడిచిపోనీ—

నా ప్రియ భావనా! ఇక సెలవా మరి!?

●

# నాలెడ్జ్ బ్యాంక్

1. పాలిలోగం ప్రధాన ప్రాటిక్?
2. 1982వ సంవత్సరం మిస్ ఇండియాగా ఎన్నికైన పామెల్లా తండ్రి ఇండో చైనా యుద్ధంలో పరమ్వీర్చక్రం అలంకరించి పరమ వీర చక్ర అందుకున్న యోధుడు అతని పేరేమిటి?
3. భూగోళంమీద మొత్తం నీటిలో సముద్ర నీటి శాతం?
4. క్యుములస్ అంటే ఏమిటి?
5. 1968వ సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి నైరుతి ఆఫ్రికాకు ఏ పేరును నామకరణం చేసింది?
6. హైదరాబాద్‌లోని సిటీ కోర్టును స్థాపించి ఎన్ని సంవత్సరాలయ్యాయి?
7. ప్రపంచ బ్యాంక్ సహాయంతో నిర్మితమవుతున్న కర్నాలి పవర్ ప్రాజెక్ట్ ఎక్కడ నిర్మిస్తున్నారు?
8. కీటకాలు ఉత్పత్తిచేసే ఫెర్మోనులలోని రసాయన పదార్థాలలో ఏవి ఉన్నాయి?
9. 'రెడ్ స్క్వేర్' ఎక్కడ ఉంది?
10. అర్జున అవార్డ్స్ మొట్టమొదటిసారిగా ఏ సంవత్సరంలో ప్రవేశపెట్టారు?

—విద్యాధిపతి.

జవాబులు:

1. ఆసియా (34 శాతం)
2. మేజర్ మహేందర్ సింగ్
3. 96 నుండి 97 శాతం
4. మేఘం
5. నమీబియా
6. 125 సంవత్సరాలు
7. నేపాల్‌లో
8. ఆల్కహాలు మొదలు సంతృప్త హైడ్రోకార్బన్ వరకు
9. మాస్కో
10. 1961వ సంవత్సరంలో

# గడితేని నుడి.

ఈ పజిల్‌కి గదులుండవు. అడ్డం నిలువు అనలే ఉండవు. ఉండాల్సిందల్లా అక్షరజ్ఞానం. ఇక్కడ ఇచ్చిన ఆధారాలను ఆధారంగా చేసుకుని ఒక అక్షరాన్ని ఊహించండి. మీ అక్షరానికి ఆధారాల్లో చెప్పినట్లుగా మరికొన్ని అక్షరాలు కలిపితే ఆయా పదాలు రావాలి. ప్రయత్నించండి.

ఆధారాలు:

ఒక అక్షరానికి:

1. ఒక అక్షరం కలిపితే అమ్మో చాలాఎక్కువ.
2. రెండు అక్షరాలు కలిపితే తక్కువలో తక్కువ
3. మూడు అక్షరాలుకలిపితే మెదడున్నా లేకపోయినా ప్రతి మనిషికి ఉండేది.
4. నాలుగు అక్షరాలుకలిపితే పక్కవాళ్ళు టిపీ కొంటే మనకువచ్చేది.
5. అయిదు అక్షరాలు కలిపితే కల, వరమైనా సాటలేనిక త్రుటిపాటైంది.
6. ఆరు అక్షరాలు కలిపితే అబ్బో చాలా చాలా కష్టం.

ఎ) ఏమిటా అక్షరం?

బి) ఏమిటా పదాలు?

—గుమ్మడవెల్లి శ్రీనివాస్ కుమార్.

